# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 06-10-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

❖ సాంకేతిక కారణాల వల్ల వరద సహాయం అందని బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం రేపు నగదు జమ చేయనుంది.

❖ రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులను గరిష్ట స్థాయిలో వినియోగించుకుని ప్రభుత్వం పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తుందని ఆ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.

❖ ఆర్.టి.సి. బస్సుల సంఖ్యను గణనీయంగా పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

❖ రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ప్రాథమిక “కీ” నీ ప్రభుత్వం విడుదల చేసింది.

❖ దసరా సెలవుల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన రైల్వే, బస్సు స్టేషన్ లు ప్రయాణికులతో కిట కిట లాడుతున్నాయి.

========================

రాష్ట్రంలో సాంకేతిక కారణాలతో వరద సహాయం అందని ప్రజల ఖాతాలలో రేపు నగదు జమ చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఆధార్ అనుసంధానం కాకపోవడంతో సహా పలు కారణాలతో ఇంకా వరద సహాయం పొందని ఒక్కొక్క కుటుంబానికి నగదు బదిలీ చేసే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల కలెక్టర్లకు అప్పగించింది. ఎన్.టి.ఆర్. జిల్లాలో 15 వేలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 4 వేల 620 కుటుంబాలతో సహా ఇతర జిల్లాలలో వరద బాధితులకు జిల్లా అధికార యంత్రాంగం ద్వారా వారి వారి ఖాతాలలో నగదు జమ చేయనున్నారు. మరొక వైపు వరద బాధితులలో ఇప్పటి వరకు 98 శాతం మందికి పరిహారం జమ చేసినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

========================

రాష్ట్రంలో పర్యాటక రంగాభివృద్ధికి అందుబాటులో ఉన్న అన్ని వనరులను రాష్ట్ర ప్రభుత్వం సద్వినియోగం చేసుకుంటుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. విశాఖపట్నంలో పర్యాటక అభివృద్ధి సంస్థ చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఈ రోజు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... "ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం" అన్న విధానానికి ప్రభుత్వం పెద్ద పీట వేసి పెట్టుబడిదారులను ఆహ్వానిస్తామని తెలిపారు. ఈ అంశంపై మా ఆకాశవాణి ప్రతినిధి వి. సత్యనారాయణ మూర్తి మరిన్ని వివరాలు తెలియజేస్తూ...

(వాయస్ 24 సెకన్లు)

========================

రాష్ట్రంలో ఆర్.టి.సి. బస్సుల సంఖ్యను గణనీయంగా పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీకాకుళం పట్టణం నుండి వివిధ ప్రాంతాలకు కొత్తగా ఏర్పాటు చేసిన 5 బస్సులను శ్రీకాకుళం శాసన సభ్యుడు గోండు శంకర్ తో కలిసి ఈ రోజు ఆయన ప్రారంభించారు. అనంతరం కేంద్ర మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రజా రవాణా వ్యవస్థను సరైన మార్గంలో ఉంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని, ఈ చర్యలలో భాగంగా ఈ ఏడాది కొత్తగా 15 వందల నుండి 2 వేల వరకు బస్సులు రానున్నాయని చెప్పారు. విమానయానం, రైల్వే, ఆర్.టి.సి. వంటి ప్రజా సంస్థలు సామాన్యునికి చేరువ అవుతున్నాయని తెలియజేశారు. తాను పౌర విమానయాన శాఖ మంత్రి హోదాలో రాష్ట్రానికి కొత్తగా 6 విమాన సర్వీసులు తీసుకువచ్చానని, ఢిల్లీ నుండి తిరుపతికి నిన్ననే కొత్త విమాన సర్వీసు ప్రారంభమైందని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

========================

రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ప్రాథమిక "కీ" ని రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ విడుదల చేసింది. ఈ నెల 3వ తేదీన ప్రారంభమైన ఈ పరీక్షలు 21వ తేదీతో ముగియనున్నాయి. అయితే... ఇప్పటి వరకు జరిగిన ఈ పరీక్షల "కీ" ను విద్యా శాఖ వెబ్ సైట్ లో ఉంచింది. మిగిలిన పరీక్షల "కీ" నీ పరీక్షలు ముగిసిన తరువాత విడుదల చేస్తారు. మొత్తం 4 లక్షల 27 వేల 300 మంది అభ్యర్థులు టెట్ కు దరఖాస్తు చేశారు. పరీక్షల తుది "కీ" నీ అక్టోబర్ 27వ తేదీన, ఫలితాలను నవంబర్ 2వ తేదీన విడుదల చేస్తారు.

========================

చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణంలో అనుమానాస్పద స్థితిలో మరణించిన బాలిక కుటుంబ సభ్యులను రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, రవాణా శాఖ మంత్రి ఎమ్. రాంప్రసాద్ ఈ రోజు పరామర్శించారు. ఈ ఘటన జరిగిన వెంటనే పోలీసులు స్పందించి.. తదనంతర చర్యలు తీసుకుంటున్నారని ఆమె తెలిపారు. ఇదిలా ఉండగా.. బాలిక కుటుంబ సభ్యులతో ముఖ్య మంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు ఫోన్ లో మాట్లాడి.. ఈ ఘటనకు కారకులైన వారిపై చర్యలు తీసుకుంటామని, బాలిక కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

విరామం

========================

దసరా సెలవుల నేపథ్యంలో ఆంధ్ర ప్రదేశ్ వ్యాప్తంగా ప్రధాన రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు ప్రయాణికులతో కిట కిట లాడుతున్నాయి. తమ స్వస్థలాలకు వెళ్ళడానికి రైళ్లు, బస్సులలో ముందస్తుగా టికెట్లు రిజర్వు చేసుకున్న ప్రయాణికులు.. అప్పటికప్పుడు ప్రయాణం చేయాలని నిర్ణయించుకున్న ప్రజలతో రైళ్లు, బస్సులు కిక్కిరిసి పోయాయి. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఒక వైపు దక్షిణ మధ్య రైల్వే... మరొక వైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పెద్ద ఎత్తున అదనపు రైళ్లు... బస్సులు నడుపుతున్నప్పటికి తీవ్ర రద్దీ నెలకొంది. దసరా సెలవుల నేపథ్యంలో 650 వరకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించగా... రాష్ట్ర రోడ్డు సంస్థ కూడా భారీ సంఖ్యలో అదనపు బస్సులు నడుపుతోంది. ఈ అదనపు బస్సులకు ప్రత్యేక చార్జి లేదని కూడా ఆర్.టి.సి. వెల్లడించింది.

========================

విజయవాడ ఇంద్రకీలాద్రిపై  శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఈ రోజు నాలుగవ రోజున శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిస్తున్న కనక దుర్గమ్మ వారు రేపు మహా చండీ దేవిగా దర్శనమివ్వనున్నారు. త్రిపురా త్రయంలో రెండవ శక్తి లలితాంబ వారు. చెరుకు గడ, విల్లు, పాశాంకుశాలను ధరించిన రూపంలో కుడివైపున లక్ష్మీ దేవి, ఎడమ వైపున సరస్వతీ దేవి సేవలు చేస్తుండగా శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు దర్శనమిస్తున్నారు. ఈ రోజు ఆదివారం కావడంతో ఇంద్రకీలాద్రిపై తీవ్ర రద్దీ నెలకొంది. అమ్మవారి దర్శనం కోసం  ఉత్తరాంధ్ర జిల్లాల నుండి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు.

========================

రాష్ట్రంలో డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈ నెల 22, 23వ తేదీల్లో "అమరావతి డ్రోన్ సమ్మిట్ - 2024" పేరుతో ఒక సదస్సు నిర్వహిస్తున్నట్టు మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి సురేష్ కుమార్, ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి విజయవాడలో ఈ రోజు జరిగిన ఒక కార్యక్రమంలో వారు డ్రోన్ సమ్మిట్ లోగో, వెబ్ సైట్ ను ఆవిష్కరించారు. గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలో జరిగే ఈ సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పాల్గొంటారని చెప్పారు. “డ్రోన్ రాజధాని”గా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కావాలన్న లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నామని, “డ్రోన్ ల సాంకేతిక పరిజ్ఞానం, వాటి వినియోగం”  అంశంపై ఈ సదస్సు చర్చిస్తుందని వారు వెల్లడించారు.

========================

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, అన్ని జోనల్ కార్యాలయాలలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం" రేపు ఉదయం 11 గంటలకు జరుగుతుందని నగర మేయర్ జి. హరి వెంకట కుమారి, జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్ ఈరోజు ఒక ప్రకటనలో తెలియజేశారు.

========================

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం లంబసింగి, తాజంగి పర్యాటక రంగ  కార్మికులు. ఈరోజు ఆంధ్రప్రదేశ్ టూరిజం కార్పొరేషన్ డెవలప్ మెంట్ సభ్యులు కె. వెంకట రమేష్ ను కలుసుకున్నారు. విజయవాడలో నిన్న ఏపీటీడీసీ ప్రధాన కార్యాలయంలో ప్రమాణ స్వీకారం అనంతరం తాజంగి, లంబసింగి  పర్యాటక ప్రదేశాల టూరిజం కార్మికులతో ప్రస్తుతం  అందుబాటులో ఉన్న సౌకర్యాలు, ఆ ప్రాంతానికి కావలసిన మౌలిక ఏర్పాట్లు కోసం కార్మికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పర్యాటకులు ఎదుర్కొనే సమస్యలు, ఆ ప్రాంతంలో కార్మికులకు గల అవకాశాలు, ఈ ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి కార్మికుల నుంచి వెంకట రమేష్ ముఖ్యమైన అంశాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు హోటళ్లు, రిసార్ట్స్ వంటి వాటిపై దృష్టి పెట్టి, స్థానిక గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

========================
========================